క్లుప్తంగా

క్షయ బాధితులకు పౌష్టికాహారం



పొదలకూరు : స్థానిక సీహెచ్‌సీలో క్షయ(టీబీ) బాధితులకు పౌష్టికాహారాన్ని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ప్రసాద్ శనివారం అందజేశారు. డీఎంహెచ్ఓ ఆదేశాల మేరకు కో–లొకేటెట్ పీహెచ్‌సీ పరిధిలో ఉన్న క్షయ బాధితులను గుర్తించి పోషక విలువలు ఉన్న ఆహారాన్ని పంపిణీ చేశారు. కార్యక్రమంలో చిన్నపిల్లల వైద్యుడు డాక్టర్ మల్లికార్జున్, గైనకాలజిస్టు డాక్టర్ పద్మావతి, టీబీ యూనిట్ పర్యవేక్షకుడు సుధాకర్, వైద్య ఆరోగ్య ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

వెంకటేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు



పొదలకూరు : పట్టణంలోని శ్రీలక్ష్మి గోదా వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో అర్చకులు శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం స్వామివారికి అభిషేకాలు, సాయంత్రం పూజలు జరిపారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

స్వామివారికి పల్లకిసేవ

దేవస్థానంలో శనివారం రాత్రి స్వామి, అమ్మవార్లకు పల్లకిసేవ గావించారు. ఈ సందర్భంగా పూజలు నిర్వహించి, భక్తులకు అన్నప్రసాదాలను అందజేశారు.

ప్రమాదాల నివారణకు..

- హైవే కూడళ్లలో లైట్ల ఏర్పాటు



మనుబోలు : మండల పరిధిలోని జాతీయ రహదారిపై పలు కూడళ్లలో రాత్రి వేళ తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. దీనిని గుర్తించిన ఎస్సై అజయ్‌కుమార్ తన సొంత నిధులతో పలు కూడళ్లలో లైట్లు ఏర్పాటు చేయించారు. బద్దెవోలు క్రాస్, వీరంపల్లి క్రాస్, పోర్టు క్రాస్‌రోడ్లలో శనివారం ఒక్కో జంక్షన్‌లో రెండేసి చొప్పున డోమ్ లైట్లు ఏర్పాటు చేయించారు. దీంతో ఎస్సై అజయ్‌కుమార్‌ను పలువురు అభినందించారు.

ఆర్థిక సాయం అందజేత



విడవలూరు : మండలంలోని పార్లపల్లి గ్రామంలో గతంలో సముద్రంలో మునిగి ఇద్దరు యువకులు మరణించగా, వారి కుటుంబాలకు కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి రూ.50 వేల చొప్పున సాయం చేస్తానని ప్రకటించారు. వారితో పాటు కృష్ణమ్మ అనే మహిళ భర్త రైలు కింద పడి మృతిచెందిన నేపథ్యంలో ఆమెకు రూ.30 వేలు అందజేస్తానని తెలిపారు. ఈ మేరకు రూ.1.30 లక్షల నగదు సాయాన్ని నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి చారిటబుల్ ట్రస్టు ద్వారా స్థానిక వైఎస్సార్‌సీపీ నేతలు శనివారం అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బెజవాడ గోవర్ధన్‌రెడ్డి, పార్టీ మండల గౌరవాధ్యక్షుడు కాటంరెడ్డి నవీన్‌కుమార్‌రెడ్డి, నాయకులు తిక్కవరపు జనార్దన్‌రెడ్డి, దాసరి మల్లికార్జున, నిమ్మల రామ్మోహన్ పాల్గొన్నారు.

తీరంలో పూడికతీత



ఇందుకూరుపేట : మండలంలోని గంగపట్నం పల్లిపాళెం వద్ద సముద్ర ముఖద్వారం వద్ద పూడికతీత పనులను శనివారం చేపట్టారు. ఇటీవల కురిసిన వర్షాలకు పల్లిపాళెం వద్ద నీరు అధికంగా చేరాయి. దీంతో గ్రామస్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ముందస్తుగా ఇందుకూరుపేట రూరల్ బ్యాంక్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మావులూరు శ్రీనివాసులురెడ్డి సొంత నిధులతో యంత్రాలను ఏర్పాటు చేసి పనులను నిర్వహించారు. ఈ మేరకు పనులను కూడా పర్యవేక్షించారు. ఆయన వెంట పీఆర్ ఏఈ ఖాదర్‌బాషా, స్థానిక వైఎస్సార్‌సీపీ నేతలు వెంకటేశ్వర్లు, సుబ్రహ్మణ్యం, ఫక్కీరయ్య పాల్గొన్నారు.

నేడు ప్రత్యేక పూజలు

బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : కార్తీకమాసం సందర్భంగా మల్లికార్జున సమేత కామాక్షితాయి అమ్మవారికి నేడు ప్రత్యేక పూజలు నిర్వహిస్తామని ఆలయ చైర్మన్ లక్ష్మీసుబ్రహ్మణ్యం నాయుడు శనివారం తెలిపారు. స్వామి, అమ్మవార్లను మొదటిసారిగా నేటి ఉదయం 8 గంటలకు ఊరేగింపుగా వేదగిరి లక్ష్మీనరసింహ దేవస్థానానికి తీసుకెళ్తామన్నారు. లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో హోమం, కుంకుమార్చన, కల్యాణం కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

ధ్యాసంతా సర్వేపల్లి అభివృద్ధిపైనే

- మద్రిపల్లిలో 70 కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరిక
- రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి



టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిన నాయకులు, కార్యకర్తలతో మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

పొదలకూరు : తన సొంత మండలమైన పొదలకూరులో మెజారిటీ తగ్గితే గెలుపుగా భావించనని, అధికార పక్షంలో మంత్రిగా పనిచేస్తున్నా తన ధ్యాసంతా సర్వేపల్లి నియోజకవర్గ అభివృద్ధిపైనే ఉంటుందని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి డాక్టర్ కాకాణి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. మండలంలోని మద్రిపల్లి గ్రామంలో టీడీపీ సీనియర్ నేత వెంపులూరు సుధాకర్ ఆధ్వర్యంలో 70 కుటుంబాల వారు మంత్రి కాకాణి సమక్షంలో శనివారం టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ తన సొంత మండలంలో మెజారిటీ తగ్గించాలని సోమిరెడ్డి శతవిధాలా ప్రయత్నించినట్లు తెలిపారు. మండల ప్రజలు తనపై ప్రేమాభిమానాలతో రెండు పర్యాయాలు ఎమ్మెల్యేగా గెలిపించారన్నారు. మండలంలో రూ.100 కోట్లతో మౌలిక సదుపాయాలు కల్పించిన విషయాన్ని గుర్తుచేశారు. ప్రజలకు ఏది అవసరమో తనకు తెలుసునని, తన తండ్రి కాకాణి రమణారెడ్డి హయాం నుంచి ఇక్కడి ప్రజలు తమ కుటుంబాన్ని ఆదరిస్తున్నట్లు తెలిపారు. మద్రిపల్లిలో తనకు మెజారిటీ వస్తున్నా వెలితిగా ఉండేదని సుధాకర్ పార్టీలో చేరడం వల్ల గ్రామంలో టీడీపీ భూస్థాపితమైందన్నారు. జల్‌జీవన్ మిషన్ ద్వారా రూ.4.40 కోట్లతో కండలేరు ఏటికాలువ నుంచి పొదలకూరు, మద్రిపల్లి గ్రామాలకు ప్రత్యేకంగా పైప్‌లైన్ నిర్మించి నిరంతరాయంగా తాగునీటిని అందించేందుకు అంచనాలు రూపొందించినట్లు తెలిపారు. ఎవరి హయాంలో గ్రామాలు అభివృద్ధి చెందాయో చర్చకు రావాలని సవాల్ విసిరారు. తన హయాంలో అభివృద్ధి జరగలేదని నిరూపిస్తే 2024 అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేయనన్నారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ గోగిరెడ్డి గోపాల్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు పెదమల్లు రమణారెడ్డి, బిరదవోలు ఎంపీటీసీ రావుల దశరథరామయ్యగౌడ్, గ్రామ నేతలు రావుల అంకోజీగౌడ్, కోసూరు జనార్దన్‌గౌడ్, గోగుల గోపాలయ్య, తాళ్ల రాజాగౌడ్, అంకోజీరావు, వెంపులూరు శ్రీనివాసులుగౌడ్, ముక్కు వెంకటేశ్వర్లు, ఎం.నాగరాజు, వెంపులూరు వెంకటేశ్వర్లు, వి.రామచంద్రయ్య, ఆర్.పెంచలయ్య పాల్గొన్నారు.

పెయ్యదూడల ఉత్పత్తితో ఆర్థికాభివృద్ధి

- పశుసంవర్ధకశాఖ ఏడీ సోమయ్య



పాడి రైతులకు డీవార్మింగ్, మినరల్ మిక్చర్ పంపిణీ

కొడవలూరు : పెయ్యదూడల ఉత్పత్తి పథకం ద్వారా పాడి రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందుతారని పశుసంవర్ధక శాఖ ఏడీ డాక్టర్ టి.సోమయ్య తెలిపారు. మండలంలోని దామేగుంటలో పెయ్యదూడల ఉత్పత్తి పథకంపై శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ లింగ నిర్ధారిత వీర్యం ద్వారా కృత్రిమ గర్భధారణ చేసి పెయ్యదూడలను ఉత్పత్తి చేయవచ్చని, దీని వాస్తవ విలువ రూ.1,350 కాగా, ప్రభుత్వం రూ.850 రాయితీ ఇస్తుందన్నారు. పాడి రైతు రూ.500 చెల్లిస్తే లింగ నిర్ధారిత వీర్య నాళికలు ఇస్తారని, వీటిని పశువుకు రెండు పర్యాయాలు ఇచ్చినప్పటికీ చూడి నిలవని పక్షంలో రూ.500 తిరిగి రైతుకే ఇచ్చేస్తారని తెలియజేశారు. పెయ్యదూడలు పాడి రైతుకు లాభదాయకం కావడంతో ఈ పథకాన్ని ప్రభుత్వం రాయితీపై అమలు చేస్తోందన్నారు. జిల్లాలో ఆరు వేల పాడి పశువులకు కృత్రిమ గర్భధారణ ద్వారా పెయ్యదూడలు ఉత్పత్తి చేయడం లక్ష్యంగా కేటాయించినట్లు పేర్కొన్నారు. ప్రతి గ్రామంలో 25 నుంచి 30 పశువులకు కృత్రిమ గర్భధారణ ద్వారా పెయ్యదూడలు ఉత్పత్తి చేయాలని నిర్ణయించినట్లు వివరించారు. ఈ సందర్భంగా గ్రామంలోని 25 మంది పాడి రైతులతో అంగీకార పత్రం తీసుకున్నారు. అనంతరం 25 పశువులకు డీ వార్మింగ్ మందులు, మినరల్ మిక్చర్ కేజీ వంతున ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో బుచ్చిరెడ్డిపాళెం ఏడీ జి.ప్రసన్నాంజనేయరెడ్డి, పశువైద్యాధికారి ఎం.హర్షవర్ధన్‌రెడ్డి పాడి రైతులు పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులతో సాగునీరు ఆదా



మాట్లాడుతున్న ఏఓ లక్ష్మి

కొడవలూరు : వ్యవసాయాధికారులు సూచించే నీటి యాజమాన్య పద్ధతులు పాటిస్తే సాగునీరు ఆదా చేసుకోవచ్చని ఏఓ లక్ష్మి సూచించారు. మండలంలోని మిక్కిలింపేట, యల్లాయపాళెం, కొత్తవంగల్లులో నీటి యాజమాన్యంపై రైతులకు శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా యల్లాయపాళెంలో ఆమె మాట్లాడుతూ వరిసాగు రైతులు తొలుత బురద పదునులో నాట్లు వేసుకుని వారం రోజుల వరకు 5 సెంటిమీటర్ల నీరు పెట్టుకోవాలని చెప్పారు. తరువాత దుబ్బు చేయడం పూర్తయ్యే వరకు పొలంలో పలుచగా 2 నుంచి 3 సెం.మీ నీరు పెట్టుకోవాలన్నారు. చిరు పొట్ట దశ నుంచి గింజ గట్టి పడే వరకు 5 సెంటిమీటర్ల నీటిమట్టం ఉంచాలన్నారు. కోతకు 7 నుంచి 10 రోజుల ముందు నుంచి నీటిని నెమ్మదిగా తగ్గించి ఆరబెట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బుచ్చి ఇరిగేషన్ ఏఈ వినయ్‌కుమార్, వీఏఏలు జి.ఉమామహేష్, సీహెచ్.వంశీకృష్ణ, డి.శివజ్ఞాన, రైతులు పాల్గొన్నారు.

ఆలయాల్లో కార్తీకమాస పూజలు



విశ్వనాథస్వామికి పూజలు చేస్తున్న భక్తులు

మనుబోలు : కార్తీక మాసం శని త్రయోదశిని పురస్కరించుకుని మండలంలోని పలు ఆలయాల్లో శనివారం ప్రత్యేక పూజలు చేశారు. మనుబోలు బీసీ కాలనీ సమీపంలోని భగవాన్ వెంకయ్యస్వామి ఆలయం వద్ద వన భోజనాలు ఏర్పాటు చేశారు. తొలుత విశ్వనాథస్వామికి ఆలయ అర్చకుడు శ్రీనివాసులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అలాగే కండలేరు ఒడ్డున వెలసిన సంగమేశ్వర ఆలయంలో స్వామివారికి అర్చకుడు ఫణీంద్రశర్మ ప్రత్యేక పూజలు చేసి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

గ్యాస్ కనెక్షన్ కిట్‌ల పంపిణీ



కొడవలూరు : మండలంలోని కొత్తవంగల్లు చీకిరేణిగుంటకు చెందిన పది గిరిజన కుటుంబాలకు ప్రధాన మంత్రి ఉజ్వల యోజన పథకం కింద గ్యాస్ కనెక్షన్ కిట్‌లు ఉచితంగా పంపిణీ చేశారు. వీటిని ఉప సర్పంచ్ చక్కా శైలజ చేతుల మీదుగా శనివారం లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ నేత మనోహర్‌బాబు మాట్లాడుతూ గ్యాస్ కనెక్షన్ల మంజూరుకు సహకరించిన ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి, డీసీఎమ్మెస్ చైర్మన్ వీరి చలపతిరావులకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నేతలు వేముల వెంకటేశ్వర్లు, రామయ్య, ఈగ తిరుపతమ్మ, శూలం హరిబాబు, ఉమామహేశ్వరరావు, మాల్యాద్రి, సుమన్, శ్రీహరి, దశయ్య పాల్గొన్నారు.

భూ సమస్యలకు పరిష్కారం



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి అచ్యుత్‌రెడ్డి

విడవలూరు : రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన రీసర్వే ద్వారా చాలా కాలంగా ఉన్న భూ సమస్యలకు పరిష్కారం లభించిందని, దీంతో అనాధి కాలంగా సర్కారుతోపుగా ఉంటున్న ప్రభుత్వ భూములకు అసైన్డ్‌మెంట్ పట్టాలు ఇవ్వనున్నట్లు వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పూండ్ల అచ్యుత్‌రెడ్డి తెలిపారు. స్థానిక రైతు భరోసా కేంద్రంలో శనివారం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో దివంగత వైఎస్సార్ హయాంలో 60 మందికి పట్టాలు ఇవ్వగా తిరిగి మళ్లీ ఆయన కుమారుడు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో 335 ఎకరాలకు రీ సర్వే నిర్వహించి పేదలకు పట్టాలు అందజేస్తున్నట్లు తెలియజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ భవానమ్మ, ఇన్‌చార్జి తహసీల్దార్ భానుప్రకాశ్, రీసర్వే డీటీ అజీజ్, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బెజవాడ గోవర్ధన్‌రెడ్డి, పార్టీ మండల గౌరవాధ్యక్షుడు కాటంరెడ్డి నవీన్‌కుమార్ రెడ్డి, పార్టీ నేత పాశం శ్రీహరిరెడ్డి, వీఆర్వో వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

నేడు ముత్తుకూరుకు మంత్రి కాకాణి

ముత్తుకూరు : రాష్ట్ర వ్యవసాయ–సహకార శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఆదివారం ఉదయం ముత్తుకూరుకు వస్తారని వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు మెట్టా విష్ణువర్ధనరెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో తలపెట్టిన కార్తీక వనభోజనాల కార్యక్రమంలో మంత్రి పాల్గొంటారని వెల్లడించారు.

1,110 మెగావాట్ల విద్యుదుత్పత్తి

ముత్తుకూరు : మండలంలోని నేలటూరులో ఉన్న శ్రీదామోదరం సంజీవయ్య ఏపీజెన్‌కో ప్రాజెక్టులో శనివారం 1,110 మెగావాట్ల విద్యుదుత్పత్తి చేశారు. ఇందులో భాగంగా ఒకటో యూనిట్లో 470 మెగావాట్లు, మూడో యూనిట్లో 640 మెగావాట్ల విద్యుదుత్పత్తి జరిగింది. సాంకేతిక కారణాల వల్ల రెండో యూనిట్లో ఉత్పత్తి నిలిపివేసినట్లు ఇంజినీర్లు తెలిపారు.

బీమా నగదు అందజేత

మనుబోలు : మండలంలోని జట్లకొండూరు పంచాయతీకి చెందిన బిరదవోలు పోలమ్మ కుమారుడు మస్తానయ్య ఇటీవల మరణించారు. వారి కుటుంబానికి అందాల్సిన బీమా సాంకేతిక కారణాలతో అందలేదు. ఈ విషయాన్ని గ్రామ ఉప సర్పంచ్ ఆవుల తులసీరాం మంత్రి కాకాణి దృష్టికి తీసుకెళ్లగా ఆయన సంబంధిత అధికారులతో మాట్లాడి బీమా అందేలా చేశారు. కాగా తులసీరాంతో పాటు వైఎస్సార్‌సీపీ నేత గుంజి రమేష్ మృతుడి తల్లి పోలమ్మకు శనివారం ఆ సాయాన్ని అందజేశారు.

ఘన నివాళి



వెంకటాచలం : మండల వైస్ ఎంపీపీ కనుపూరు కోదండరామిరెడ్డి తల్లి రమణమ్మ శుక్రవారం అనారోగ్యంతో మృతి చెందగా, ఆమె అంత్యక్రియలు శనివారం జరిగింది. కార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, డీసీసీబీ మాజీ చైర్మన్ వేమారెడ్డి శ్యాంసుందర్‌రెడ్డి, ఇతర ప్రముఖులు హాజరై, నివాళి అర్పించారు. అనంతరం కోదండరామిరెడ్డిని పరామర్శించారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

- ఎస్ఈబీ ఈఎస్ రవికుమార్



మద్యాన్ని పారబోస్తున్న ఎస్ఈబీ సిబ్బంది

కోవూరు : యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ఎస్ఈబీ ఈఎస్ రవికుమార్ అన్నారు. కోవూరులోని ఎస్ఈబీ కార్యాలయంలో ఇటీవల రెండు కేసుల్లో స్వాధీనం చేసుకున్న తొమ్మిది మద్యం బాటిళ్లను శనివారం ధ్వంసం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఇంటర్, డిగ్రీ, ఇంజినీరింగ్ కళాశాలల్లో మత్తు పదార్థాలు, ఇతర మాదక ద్రవ్యాలపై యువతలో చైతన్యం తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో కోవూరు సీఐ నరహరి, సిబ్బంది ఉన్నారు.

'ఆడుదాం ఆంధ్రా'కు రేపటి నుంచి రిజిస్ట్రేషన్లు



మాట్లాడుతున్న ఎంపీడీఓ శ్రీహరి

కోవూరు : మండలంలోని 16 సచివాలయాల పరిధిలో రేపటి నుంచి 'ఆడుదాం ఆంధ్రా'కు రిజిస్ట్రేషన్ల ప్రక్రియ ప్రారంభమవుతుందని ఎంపీడీఓ శ్రీహరి అన్నారు. కోవూరులోని మండల పరిషత్ సమావేశ మందిరంలో పంచాయతీ కార్యదర్శులు, మహిళా పోలీసులు, పాఠశాలల ఫిజికల్ డైరెక్టర్లతో శనివారం ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 15 ఏళ్లు పైబడిన బాలబాలికలు క్రీడల్లో పాల్గొనవచ్చని తెలిపారు. ఆసక్తి కలిగిన వారు ఈ నెల 27 నుంచి డిసెంబరు 2వ తేదీలోగా గ్రామ సచివాలయాల్లో పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, క్రికెట్, బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహిస్తామని, వీటి కోసం మండలంలో తొమ్మిది క్రీడా మైదానాలను ఎంపిక చేశామన్నారు. కొత్తూరులో ఉన్న కేఎస్ఎన్ ఇంజినీరింగ్ కళాశాల ప్రాంగణం, గంగవరంలో ఉన్న గీతాంజలి ఇంజినీరింగ్ కళాశాల ప్రాంగణంతో పాటు గమ్మళ్లదిబ్బ, పాటూరు, లేగుంటపాడు, వేగూరులో ఉన్న ఉన్నత పాఠశాలల క్రీడా ప్రాంగణాలు, కోవూరులోని జెడ్పీ బాలికోన్నత పాఠశాల, ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రాంగణాలను ఎంపిక చేశామన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ–2 చెంచులక్ష్మమ్మ, ఆర్‌డబ్ల్యూఎస్, గృహ నిర్మాణ శాఖల ఏఈలు జగదీష్, మాధవయ్య తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో అభివృద్ధి పరుగులు



వైఎస్సార్‌సీపీ జెండాను ఆవిష్కరించిన పార్టీ నేతలు

బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రాష్ట్రంలో అభివృద్ధి పరుగులు పెడుతోందని వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు చెర్లో సతీష్‌రెడ్డి అన్నారు. మండలంలోని పురంధరపురం గ్రామంలో 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమం శనివారం నిర్వహించారు. తొలుత గ్రామంలో వైఎస్సార్‌సీపీ జెండాను ఎగురవేశారు. అనంతరం సతీష్‌రెడ్డి మాట్లాడారు. రాష్ట్రంలో జరిగిన అభివృద్ధిని గమనించి ప్రజలు ఓటు వేయాలన్నారు. మళ్లీ రాష్ట్రానికి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎం కావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో గ్రామ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు



కోవూరు : కోవూరులోని పచ్చిపాల రామనాథమ్మ జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో నవంబర్ 26వ తేదీ రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. ప్రాథమిక దశ నుంచి రాజ్యాంగంపై అవగాహన పెంపొందించేందుకు ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు హెచ్ఎం నరసింహమూర్తి తెలిపారు. గెలుపొందిన వారికి బహుమతులు అందజేస్తామన్నారు.

మరమ్మతులు చేయాలి



కోవూరు : మండలంలోని పడుగుపాడుకు సంబంధించి కొత్త కాలువ, సాయిపాళెం కాలువ, లోతు కాలువలను ఉపాధి హామీ పథకం ద్వారా మరమ్మతులు చేసేలా ఇరిగేషన్ శాఖ ప్రత్యేక దృష్టి సారించాలని పడుగుపాడు సొసైటీ చైర్మన్ రామిరెడ్డి మల్లికార్జునరెడ్డి తెలిపారు. కోవూరు మండలం పడుగుపాడు, లేగుంటపాడు గ్రామ పంచాయతీల్లో శనివారం రబీ పంటకు సంబంధించి నీటి యాజమాన్యం, విత్తనాల ఎంపిక తదితర అంశాలపై వ్యవసాయ, ఇరిగేషన్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయాధికారులు మాట్లాడుతూ రైతులు వరిసాగుకు సంబంధించి అధికారుల సూచనలు తప్పక పాటించాలన్నారు. నీటి యాజమాన్యంపై అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో ఇరిగేషన్ ఏఈ వెంకటేశ్వర్లు, ఎంపీటీసీ సభ్యుడు శ్రీనివాసులురెడ్డి ఉన్నారు.

అక్రమంగా సాగు

- పోలీసులకు ఫిర్యాదు



విడవలూరు : మండలంలోని దంపూరు గ్రామంలో ప్రభుత్వ భూమిలో అక్రమంగా వరిసాగు చేస్తున్న వారిపై స్థానిక వీఆర్వో సులోచనమ్మ శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. దంపూరు గ్రామంలో సర్వే నంబర్ 418లో 10.64 సెంట్ల గ్రామకంతం భూమిని ఎవరూ సాగు చేయకూడదని ప్రభుత్వం ఇదివరకే హెచ్చరికలు జారీ చేసింది. అయినా కొందరు అక్రమార్కులు వరినాట్లు వేయడంతో అధికారులకు ఫిర్యాదు చేసినట్లు వీఆర్వో తెలిపారు. దీనిని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి చర్యలు తీసుకుంటామని ఇన్‌చార్జి తహసీల్దార్ భానుప్రకాశ్ తెలిపారు.

మహిళలకు అండగా నిలవాలి



మనుబోలు : మహిళలతో కలిసి ర్యాలీలో పాల్గొన్న ఎస్సై అజయ్‌కుమార్



కొడవలూరు సంఘమిత్ర కార్యాలయం వద్ద ప్రతిజ్ఞ



పొదలకూరు : ర్యాలీ నిర్వహిస్తున్న పొదుపు మహిళలు

- ఎస్సై అజయ్‌కుమార్

మనుబోలు : సమాజంలో ప్రతిఒక్కరూ మహిళలను గౌరవిస్తూ వారికి అండగా ఉండాలని ఎస్సై అజయ్‌కుమార్ అన్నారు. మహిళలపై హింస నిర్మూలన దినోత్సవాన్ని పురస్కరించుకుని వెలుగు ఏపీఎం వనజాక్షి ఆధ్వర్యంలో పొదుపు మహిళలు శనివారం ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎస్సై అజయ్‌కుమార్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు అధిక ప్రాధాన్యమిస్తూ అన్ని రంగాల్లో వారిని ప్రోత్సహిస్తోందన్నారు. దిశ లాంటి చట్టాలు తెచ్చి వారి రక్షణకు భరోసా కల్పిస్తోందని తెలిపారు. ఏపీఎం వనజాక్షి మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాల్లో మహిళలకే అధిక ప్రాధాన్యం ఇస్తుండడం శుభ పరిణామమన్నారు. ఈ ర్యాలీలో ఎంపీడీఓ ప్రసాద్, ఏపీఓ రాజమ్మ, సీసీలు జయమ్మ, ధనమ్మ, దేవమ్మ, రాజేశ్వరి, అకౌంటెంట్ పార్వతి తదతరులు పాల్గొన్నారు.

బాల్య, బలవంతపు వివాహాలను వ్యతిరేకిద్దాం

కొడవలూరు : బాల్య, బలవంతపు వివాహాలను వ్యతిరేకిద్దామని వైఎస్సార్ క్రాంతి పథం ఏపీఎం ఎస్.రుక్మిణి పిలుపునిచ్చారు. మహిళలపై హింస నిర్మూలన దినోత్సవం సందర్భంగా కొడవలూరు సంఘ బంధం ఆధ్వర్యంలో శనివారం గ్రామంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కూతురు, కొడుకు అనే తారతమ్యం చూపడం హేయమైన చర్య అని పేర్కొన్నారు. బాల్య, బలవంతపు వివాహాలు అంతరించి పోయేలా అందరం కృషి చేయాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో స్త్రీ హక్కులను తెలియజేయడంతో పాటు స్త్రీలపై జరుగుతున్న హింసను అరికట్టేందుకు నాలుగు వారాల పాటు అవగాహన కార్యక్రమాలు నిర్వహించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. ఈనెల 25 నుంచి ప్రారంభమవుతున్న కార్యక్రమాలు వచ్చే నెల 22వ తేదీ వరకు కొనసాగుతాయని చెప్పారు. మొదటి వారంలో హింసకు వ్యతిరేకంగా, రెండో వారంలో బాల్య వివాహాలపై, మూడో వారంలో రక్తహీనతపై, నాలుగో వారంలో ఆడ పిల్లల చదువుపై ప్రతి గ్రామంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. అనంతరం స్త్రీ హక్కుల పరిరక్షణకు కట్టుబడి ఉంటామంటూ స్థానికులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో సీసీలు కె.ఉదయ్‌కుమార్, శ్రీదేవి, మమత, సంఘమిత్ర కోశాధికారి ప్రవీణ, సంఘ బంధాల సభ్యులు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

పట్టణంలో ర్యాలీ

పొదలకూరు : జెండర్ ఆధారిత హింసకు వ్యతిరేకంగా మండల పొదుపు సమాఖ్య ఆధ్వర్యంలో శనివారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక వైఎస్సార్ క్రాంతిపథం కార్యాలయం నుంచి రామనగర్‌గేటు సెంటర్ వరకు మహిళలు ర్యాలీ నిర్వహించి 'నిశ్శబ్దాన్ని ఛేదిద్దాం.. ఇక సహించం' అంటూ నినాదాలు చేశారు. ముందుగా మండల సమాఖ్య ఈసీ సమావేశం నిర్వహించారు. జగనన్న తోడు, సంఘాలు తీసుకున్న బ్యాంకు రుణాల రికవరీ తదితర అంశాలపై అధ్యక్షురాలు మీనా మాట్లాడారు. కార్యక్రమంలో ఏపీఎం రోజ్‌మేరి, వీఓఏలు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.